క్లుప్తంగా

నేటి నుంచి ఉచితంగా ధ్యాన యోగా, ఆయుర్వేద శిక్షణ

మోతీనగర్: శ్రీ రుషి శక్తి యోగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోతీనగర్ రాయల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత ధ్యాన యోగా, ఆయుర్వేద శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీహెచ్ రఘురాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. 10 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం మూడు బ్యాచ్‌లుగా ఉంటాయన్నారు. ఈ శిక్షణలో 10–80 సంవత్సరాల వారు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య హైస్కూలులో నాసా, స్పేస్ సెటిల్మెంట్ కంటెస్ట్–2023లో శుక్రవారం జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, ప్రిన్సిపల్ సునీల, డీన్స్, ఇన్‌చార్జ్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

మైనార్టీ మహిళలకు త్వరలో టైలరింగ్ సెంటర్

మోతీనగర్: ఆర్‌కే సొసైటీ కమ్యూనిటీహాల్‌లో ఖాద్రి స్వచ్ఛంద సంస్థ నుంచి స్కిల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్‌తో కలసి మైనార్టీ మహిళల టైలరింగ్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ సబిహా బేగం తెలిపారు. టైలరింగ్ సెంటర్ ఏర్పాటు సాధ్యసాధ్యాలను పరిశీలించామన్నారు. త్వరలో సెంటర్‌ను ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సుభాన్, షేక్ ఇస్మాయిల్, నరసింహ, సలీం, తాజ్‌బి, రుబీనా తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఆకట్టుకున్న పరేడ్


8వ బెటాలియన్‌లో వార్షిక పరేడ్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో వార్షిక ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్ ఆకట్టుకుంది. బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ముఖ్య అతిథిగా టీఎస్ఎస్పీ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ పాల్గొన్నారు. అనంతరం సిబ్బందిచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్ కమాండర్‌గా అసిస్టెంట్స్ కమాండెంట్ డి నారాయణదాసు వ్యవహరించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రహమాన్, నారా శివస్వామి, నారాయణదాసు, సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కఠిన చట్టాలతోనే మహిళలకు రక్ష

● సినీ నటుడు సుమన్

వెంగళరావునగర్: మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, హత్యాకాండలను నియంత్రించే విషయంలో దేశంలో చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సినీనటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఎస్‌కేఎఫ్ఐ కరాటే డూ ఫెడరేషన్, తెలంగాణ అమెచ్యూర్ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 4వ ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. కరాటే పోటీలకు 18 రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలు రెండురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ... చాలా దేశాలతో పోల్చితే మనదేశంలో చట్టాలు వాటి అమలు అంత కఠినంగా లేవని అన్నారు. చట్టాల్లోని లొసుగులను అడ్డం పెట్టుకుని అనేకమంది ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం తప్పులు చేసి కూడా తప్పించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్న పిల్లలమీద కూడా అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు సైతం తమను తాము రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరాటే లాంటి ఆత్మరక్షణ విద్యల వల్లనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఎస్‌కేఎఫ్ఐ సంస్థ చైర్మన్ డాక్టర్ వి.రవి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. పోటీల ఆర్గనైజర్ సహదేవ్, ఎస్‌కేఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్‌శర్మ, జనరల్ సెక్రటరీ లాల్‌దాదా, రుద్రమదేవి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎస్.లక్ష్మీసామ్రాజ్యం, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఇంటింటికీ నీటి కనెక్షన్ ఇస్తాం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుకు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బాలానగర్: గ్యాస్, పెట్రోల్ ధరలను కేంద్ర ప్రభుత్వం విపరీతంగా పెంచటంతో నిత్యావసరాల ధరలు పెరిగి కార్మిక కర్షక మధ్య తరగతి, సామాన్య ప్రజలు, వేతన జీవులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించామని అన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. రాబోయే వారం రోజుల్లో ఇంటింటికీ మంచినీటి కనెక్షన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలన్నిటిని ఇప్పటికే నెరవేర్చామన్నారు. గృహలక్ష్మీ పథకానికి కులంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చని అందరికీ అందజేస్తామన్నారు. ఒకనాటి ఇందిరాగాంధీ నగర్‌కు నేటి ఇందిరాగాంధీ నగర్‌కు ఎంతో మార్పు గమనించవచ్చన్నారు. కాలనీ వాసులు ఆలోచన చేయాలన్నారు.

ఎమ్మెల్యే పాదయాత్ర...

బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్, ఎన్‌టీఆర్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, ఇందిరాగాంధీ నగర్‌లలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించారు. అడిగిందే తడవుగా అన్ని అభివృద్ధి పనులు చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మీకే మా ఓటు అని స్థానికులు, మహిళలు పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్ కిట్ అందజేత....

బాలానగర్ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 11వేల మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్కూల్ కిట్‌లను అందజేయనున్నట్లు తెలిపారు.


పాదయాత్రలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెలే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్సకు ఆర్థికసాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన 13లక్షల 69 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వాటర్ పైపులైన్లు వేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన శ్రీనివాస్‌గుప్తా

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్ నుంచి కబీర్‌నగర్ చౌరస్తా వరకు పురాతన వాటర్ పైపులైన్ స్థానంలో ఆధునిక పైపులైన్లు వేయాలని గ్రీవెన్స్ సపోర్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ మీడియా కమిటీ చైర్మన్ ఊటుకూరు శ్రీనివాస్‌గుప్తా శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... జనసాంద్రత పెరగడంతో ప్రస్తుతం ఉన్న పైపులైన్ సామర్థ్యం చాలకపోవటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. త్వరలో అధికారులను సంఘటనా స్థలానికి పంపి నివేదిక వచ్చిన తరువాత నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కేశవరెడ్డి, పాండురంగారెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ వెస్ట్‌లో త్వరలో పనులు ప్రారంభిస్తాం


సాయినగర్ వెస్ట్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఈస్ట్ సాయినగర్‌లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సాయినగర్ వెస్ట్‌లో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నం.2,4 ప్రధానరోడ్డులో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు. అనంతరం సీసీ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, జైహింద్, శేఖర్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, భారత్‌కుమార్, దినేష్, బాలీశ్వర్, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన


నేతాజీకాలనీలో యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీలో కోటి రూపాయలతో చేపట్టిన యూజీడీ పనులను శుక్రవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. కాని అబద్ధ ప్రచారాలతో బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. అసత్యపు ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా తమ పంథా మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఈ పవన్‌రెడ్డి, కంచి రాజ్‌కుమార్, బస్వరాజు, కరుణాకర్, జీఎస్ కేశవరావు, వెంకట్, నర్సయ్య, వారాల స్వామి, కంచిస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు భాగ్యనగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని శుభోదయకాలనీ, ఆదిత్యానగర్, భాగ్యనగర్, ఫేజ్2లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

◆ అదే విధంగా జన్మభూమి ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, తారకరామనగర్, దత్తాత్రేయకాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ సైబర్ సిటీ ఫీడర్ పరిధిలో...

మూసాపేట: సైబర్ సిటీ ఫీడర్ పరిధిలోని వివేక్‌నగర్, ఆర్‌వీ లక్ష్మి ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు... అదే విధంగా వివేక్‌నగర్, బాలాజీనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు.

నేడు నిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్ ర్యాలీ

లక్డీకాపూల్: నిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్టు ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణ్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ద్రాక్షాయణి, అలైడ్ హెల్త్ సర్వీసెస్ కాలేజీ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం జరిగే యాంటీ ర్యాగింగ్ వాక్ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజేశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ పాల్గొంటారన్నారు. ఇప్పటికే ఆయా కాలేజీల్లో బెదిరింపులను ఆపండి.. ర్యాగింగ్‌కు నో చెప్పండి అనే అంశంపై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించామన్నారు. ఈ నెల 14న ర్యాగింగ్ ఈజ్ యాన్ ఈవిల్ అంశంపై వక్తృత్వ పోటీ, 16న బెదిరింపులను ఆపండి–ర్యాగింగ్‌కు నో చెప్పండి అపూ అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు.

నియామకం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఇద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌నర్సింగరావు, రాష్ట్ర ఇన్‌చార్జీ అక్షయ్ లక్రా నియామకపత్రాలను అందించారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శులుగా సి సునీల్‌కుమార్, సోమన్నగారి రచనారెడ్డిలను నియమించారు. ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ శాఖకు సునీల్‌కుమార్ అధ్యక్షుడుగా పనిచేశారు. ప్రస్తుతం రచనారెడ్డి ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా


శేషాద్రినగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శేషాద్రి నగర్‌కాలనీలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కాలనీ అధ్యక్షుడు యాదగిరిరావు, ప్రధాన కార్యదర్శి శాంత కుమార్‌రెడ్డి, బస్తీ కమిటీ అధ్యక్షుడు ప్రభాకరరావు, భీమ్‌రావు, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: గీతాంజలి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ×సోషల్ కాజ్ డ్రైవ్ టు ఇంప్రూవ్ ది నైబర్‌హుడ్×ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ఈ ర్యాలీ నిర్వహించిన గీతాంజలి స్కూల్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, జిల్లా గణేష్, శివరాజ్‌గౌడ్, ఉమేష్, సంతోష్, బిరాదర్, పద్మయ్య, ప్రిన్సిపాల్ సైదా, సిబ్బంది శైలజ, గీత, ప్రసన్న, సుమ, మోనిష్‌రెడ్డి, శ్రీసమన్విత, తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత వారి బాధ్యతలను గుర్తెరగాలి

● జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య
● ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా బీహెచ్‌ఈఎల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని యువతకు పచ్చదనపు నైపుణ్యం అనే నినాదంతో ఐక్యరాజ్యసమితి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నేటి యువతకు వారి బాధ్యతలను గుర్తు చేసేందుకు, వారి శక్తిని చాటేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడిచి పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో కేన్సర్ వ్యాధి వేగంగా పెరుగుతోంది

కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి



రాయదుర్గం: భారతదేశంలో కేన్సర్ వేగంగా పెరుగుతోందని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కేన్సర్ కేర్ స్పెషల్ సెంటర్‌ను శుక్రవారం మరింత ఆధునికీకరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, వృద్ధాప్య జనాభా, మెరుగైన రోగనిర్ధారణ పద్ధతులు అందుబాటులో లేని కారణంగా దేశంలో కేన్సర్ వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రఖ్యాత సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ పి.జగన్నాథ్ మాట్లాడుతూ దేశంలోని కేన్సర్ కేర్‌కు సంబంధించిన ప్రధాన సంస్థల్లో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రిలో 30 మందికి పైగా మెడికల్, సర్జికల్, రేడియేషన్ అంకాలజిస్టుల బృందం అందుబాటులో ఉంటుందన్నారు.

'వర్గీకరణకు మద్దతిచ్చే బీజేపీని భూస్థాపితం చేస్తాం'

ఖైరతాబాద్: ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే భారతీయ జనతా పార్టీని భూస్థాపితం చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. శుక్రవారం మింట్ కంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంచందర్ మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కులాల మధ్య విభేదాలు సృష్టిస్తే సహించేది లేదని, ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని లేని పక్షంలో గతంలో తెలుగు దేశం పార్టీకి పట్టిన గతే బీజేపీకీ తప్పదన్నారు.

యువకులకు కౌన్సిలింగ్

మాదాపూర్: హైటెక్‌సిటీలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో హల్‌చల్ చేసిన 5 మంది యువకులను పెట్రోలింగ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. రాత్రిపూట భోజనానికి వచ్చి దురుసుగా ప్రవర్తించిన వారిని అదుపులోకి తీసుకుని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్టు పోలీసులు తెలిపారు.

ఐక్యత కోసం జాతీయ స్థాయిలో ప్రచారం


మాట్లాడుతున్న సత్యవతి

పంజగుట్ట: ఐక్యత, ప్రేమ, మనం అంతా ఒక్కటే అనే నినాదాన్ని సమాజంలో పెంపొందించేందుకు 'మేరే ఘర్ ఆకేతో దేఖో' జాతీయ స్థాయి ప్రచారం చేస్తున్నట్లు భూమిక లేడీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు సత్యవతి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ మహిళా, ట్రాన్స్‌జెండర్స్ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతూ... కుల, మతతత్వ విద్వేషాలు దేశ ప్రజల మధ్య అఘాతం సృష్టిస్తోందన్నారు. ఆర్థిక పరమైన అసమానతలు తొలగించి అందరం ఐక్యమే అని నిరూపించేందుకు మా ఇంటికి ఒక్కసారి వచ్చిచూడండి, అనే క్యాంపెయినింగ్ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఇందులో ఐక్యత సామరస్యాన్ని ప్రోత్సహించడం, అన్ని వర్గాల మధ్య సామూహిక స్నేహం పెంపొందించడం, మహిళలు, దళితులు, ఆదివాసీలు, రైతులు, ట్రేడ్ యూనియన్లు ఉపాధ్యాయులు, విద్యార్థులను కలుపుకొని పోతామన్నారు. జాతి, మతం, కులం, లింగం, తారతమ్యాలు లేకుండా అందర్నీ గౌరవించేందుకే ఈ కార్యక్రమమని, వారి ఇంటికి వెళ్లి వారు ఇచ్చే విందు స్వీకరించి మనం అంతా ఒక్కటే అని నిరూపిస్తామన్నారు. కార్యక్రమంలో తాష్, సిస్టర్ లిసెన, రచన తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ డిగ్రీ అడ్మిషన్ల చివరి ఫేజ్‌ను సద్వినియోగం చేసుకోండి

● ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌లో దోస్త్ డిగ్రీ అడ్మిషన్ల చివరి ఫేజ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.లక్ష్మణ్ నాయక్ కోరారు. గత నెల వర్షాల వల్ల, ఎంసెట్ కౌన్సెలింగ్ వల్ల విద్యార్థులు ఇంకా ఆయా కాలేజీల్లో చివరి దశ ఆప్షన్స్ పెట్టుకోవాలని కోరారు. సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మొట్టమొదటి సారిగా ఒకేసారి మూడు కొత్త కోర్సులు ప్రవేశ పెట్టామన్నారు. కంప్యూటర్ సైన్స్ డాటా సైన్స్, స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్ అనే కొత్త కోర్సులు పరిచయం చేయడం జరిగిందని వెల్లడించారు. దోస్త్ ఇచ్చిన విధంగా స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్ ప్రకారం ఈ నెల 5వ తేదీ నుంచి 13 తేదీ వరకు రూ. 400 దోస్త్ ఆన్‌లైన్ పోర్టల్‌లో విద్యార్థులు చెల్లించి రిజిస్టర్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 7 నుంచి 14 వరకు స్పెషల్ ఫేజ్ వెబ్ ఆప్షన్ అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 15న స్పెషల్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని 18 నుంచ 21 వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలన్నారు.


మిస్టర్ గ్లోబల్ టైటిల్ గెలుస్తా..

మిస్టర్ ఇండియా గ్లోబల్ విజేత జసన్ బ్రిట్ ఫిలిన్


మిస్టర్ ఇండియా టైటిల్ చూపిస్తున్న జసన్

పంజగుట్ట: మిస్టర్ గ్లోబల్ టైటిల్ గెలిచి తెలంగాణ, హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెడతానని ఇటీవల జరిగిన మిస్టర్ ఇండియా గ్లోబల్‌గా విజయం సాధించిన జసన్ బ్రిట్ ఫెలిన్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్టర్ ఇండియా గ్లోబల్ విశేషాలు వెల్లడించాడు. గ్లోబల్ మిస్టర్ ఇండియా పోటీలకు దేశవ్యాప్తంగా 65 వేల దరఖాస్తులు వచ్చాయని అందులో 32 మందిని ఎంపికచేసి అందులోంచి తిరిగి 25 మందిని ఫైనల్ లిస్టు చేశారని తెలిపారు. పబ్లిక్ స్పీకింగ్, ఫిట్‌నెస్, జనరల్ నాలెడ్జి, ట్యాలెంట్, గుడ్‌మ్యానరిజం, గుడ్ లుక్స్ అన్నింటిలో తాను ముందంజలో ఉండి మిస్టర్ ఇండియా గ్లోబల్‌గా నిలిచానని వెల్లడించారు. నవంబర్‌లో థాయిలాండ్‌లో జరిగే మిస్టర్ గ్లోబల్‌కు భారత్ తరఫున తాను బరిలోకి దిగనున్నట్లు తెలిపారు. రుబారు మిస్టర్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గోవాలోని బోగ్మాల్ బీచ్ రిసార్ట్‌లో పోటీలు జరిగాయన్నారు. మిస్టర్ గ్లోబల్ ప్రదిత్ ప్రదినూత్ చేతులమీదుగా మెడిల్ అందుకున్నానని తెలిపారు. చిన్నతనం నుంచే తల్లితండ్రులు పేద పిల్లలను ఆదుకోవడం, కుష్ఠు రోగులకు సేవ చేయడం, అనాథలను చేరదీయడం, పేదవారికి చదువులు చెప్పించడం తమ ఫ్యామిలీ ఎడ్యూ వీజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తుంటామని ఆయన తెలిపారు. జసన్ తల్లి చందన బ్రిట్ ఫెలిన్, తండ్రి వాలెంటన్ బ్రిట్ ఫిలిన్ పాల్గొన్నారు.

చిత్రప్రదర్శన ప్రారంభం


ఆకట్టుకుంటున్న చిత్రాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఎ ఫెస్ట్ ఫర్ ద ఐస్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర అడ్వైజర్ డాక్టర్ కే.వి రమణాచారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 40 చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్.కె.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.